## క్లుప్తంగా

### ఉచిత కోచింగ్

**వినుకొండ(నూజెండ్ల):** రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వితంరాజుపల్లి సమీపంలోని బాలాజీ ఐటీఐ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 24 ఆదివారం జరిగే ఉచిత అవగాహన సదస్సు, ఉచిత కోచింగ్‌కు ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7702892288, 8341821710 నంబర్లను సంప్రదించాలన్నారు.

### రేపు హోలీ గన్స్ పంపిణీ

**నరసరావుపేట ఈస్ట్:** హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని వాసవీ క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో ఈనెల 24వతేదీ ఉదయం 10.45 గంటలకు పాండురంగస్వామి ఆలయం వద్ద ఉచితంగా హోలీ గన్స్ పంపిణీ చేయనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వంకాయల ఆంజనేయులు, శ్రీ వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనాలను కలపకుండా సహజ సిద్ధంగా రంగులను తయారు చేసి తీసుకురావాలని కోరారు. రసాయనాల రంగులను వినియోగించటం వల్ల చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున హోలీ వేడుకలలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఆకుకూరలతో తయారు చేసుకున్న రంగులతో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

### పౌష్టికాహారం తీసుకోవాలి

**బొల్లాపల్లి:** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మేళ్లవాగు సెక్టారు అదే గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులుతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపర్ వైజరు ఎస్ కె మస్తాన్ బీ పోషకాహారం గురించి వివరించారు. ప్రతిఒక్కరు పౌష్టికాహారం భుజించాలని సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంపూర్ణ పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎమ్ భాస్కర్ నాయక్ అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.సరోజిని, టి.సీత, ఆయాలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సహాయం

**చిలకలూరిపేట:** ప్రతిభగల పేద విద్యార్థులను ఆదరించాలని ఆర్యవైశ్య విద్యానిధి సంఘం కన్వీనర్ పొట్టి శ్రీరాములు చెప్పారు. సంఘ ఆధ్వర్యంలో బీడీఎస్ చదువుతున్న వంశీ, బీటెక్ చదువుతున్న సాయిధర్మ అనే ఇరువురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున ఉపకార వేతనాలను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జీవీ రాఘవులు, సభ్యులు తూనుగుంట్ల వెంకట రామయ్య, ఆలపాటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా తిరునాళ్ల

**ఈపూరు:** మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ బోటిమీద ప్రసన్నాంజనేయ తిరునాళ్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఉదయం నుంచే అధికసంఖ్యలో హాజరై స్వామివారికి పొంగళ్లు సమర్పించారు. భక్తులు తమ పశువులను దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం తరఫున ఒక విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

### గాయపడ్డ మార్టూరు వాసి మృతి

**యద్దనపాడు:** అసలే అనారోగ్య సమస్య.. ఆపై రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డ వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తిమ్మాపురం తిరుమల కాటన్ మిల్స్ సమీపంలో చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఆటో, అలాగే స్కూటీని కారు వెనుక నుంచి ఢీకొన్న విషయం విదితమే. బాపట్ల జిల్లా మార్టూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ సుమిత్రాబాయి సమీప బంధువు జస్సావత్ పెదమంత్రు నాయక్ అనారోగ్యంతో గురువారం గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొంది కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో ఇంటికి వెళ్తున్న క్రమంలో తిమ్మాపురం హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో ఆటోలోని వారితో పాటు స్కూటీపై వ్యక్తి కూడా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడి చిలకలూరిపేట ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పెదమంత్రు నాయక్ (73) అదేరోజు రాత్రి మృతి చెందాడు. మనవడు భుక్యా వినోద్ ఫిర్యాదు మేరకు యద్దనపాడు ఎస్ఐ జె.శ్యామేల్ రాజీవ్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, మార్టూరు సుగాలీ కాలనీలో అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### ఆరోగ్య సురక్షను ..

**బొల్లాపల్లి:** గ్రామాల్లో ఆరోగ్య సురక్షను ఉపయోగించుకోవాలని బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఎం.సాయి వినూత్న తెలిపారు. బొల్లాపల్లి పిహెచ్‌సీ పరిధిలో గండిగనుమల సచివాలయం వద్ద శుక్రవారం ఆరోగ్య సురక్ష ఫేజ్ 2లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని పీహెచ్‌సీ వైద్యులు ఎం సాయి వినూత్న, ప్రత్యేక వైద్యులు జి.శ్రీనివాస రెడ్డి, కంటి వైద్యనిపుణులు ప్రారంభించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య చికిత్సలు అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష పథకంలో వైద్యశిబిరంతో పలు రకాలు మెరుగైన సేవలు అందుతున్నాయని అన్నారు. ఈ వైద్య శిబిరంలో 328 మందికి వైద్య సేవలు అందజేశారు. వీరిలో 38 మందికి కంటి వైద్యపరీక్షలు చేసి కళ్లజోళ్లు పంపిణీ చేశారని ఈమేరకు వైద్యులు తెలిపారు.

# కూటములకు పునాదులు కదులుతాయి

- ఎంత మంది కలిసొచ్చినా విజయం వైఎస్సార్ సీపీదే
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో ఎన్నికల ప్రచారం ప్రారంభం



దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

**వినుకొండ(నూజెండ్ల):** వినుకొండలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో యువనాయకులు బొల్లా గిరిబాబు కుటుంబ సమేతంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ప్రచార రథాన్ని ప్రారంభించి పట్టణంలోని 28వ వార్డులో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వందలాది మంది కార్యకర్తలతో ప్రచార ర్యాలీ అట్టహాసంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు వార్డు ప్రజలు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు.

**గత పాలన, నేటి పాలనను ప్రజలు బేరీజు వేయాలి**

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ బెంగళూరు వంటి మహానగరాల్లో తాగునీటి సమస్య తలెత్తి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వినుకొండ ప్రజలకు మాత్రం మండు వేసవిలో కూడా తాగునీటి ఎద్దడి లేకుండా సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండ పట్టణాన్ని ఎలా అభివృద్ధి చేశామో ప్రజలు గమనించాలన్నారు. వినుకొండ పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు వంద పడకల ఆసుపత్రి, మున్సిపాలిటీ స్టేడియం, వినుకొండ రామలింగేశ్వరస్వామి ఘాట్‌రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామసచివాలయాలు, అర్బన్‌హెల్త్ సెంటర్‌లు, ట్రామాకేర్ సెంటర్, పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు అనేక కళాశాలలకు అనుమతులు తీసుకొచ్చామన్నారు. నరసరావుపేట ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ప్రజలు ఆశీర్వదిస్తే వినుకొండను తమదైన శైలిలో అభివృద్ధి చేస్తామని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు

**టీడీపీకి ఓటు వేస్తే ప్రజల ఆస్తులకు రక్షణ కరవు...**

తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే ప్రజల ఆస్తులకు కూడా రక్షణ లేకుండా పోతుందని, గతంలో టీడీపీ నాయకులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి ఏబీఎం ఆస్తులు, ముస్లిం మైనార్టీ సోదరుల ఆస్తులు, సామాన్య ప్రజలను బెదిరించి ఆస్తులను కబ్జా చేశారని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు ఎలాంటి భయంలేకుండా వ్యాపారాలు చేసుకునేందుకు సహకరించామని, రియల్ ఎస్టేట్ రంగాన్ని కూడా అభివృద్ధి చేశామని చెప్పారు.

**విజయం మాదే...**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజారంజక పాలనను చూసి మరలా అధికారంలోకి వస్తారని గ్రహించిన చంద్రబాబు టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలతో అనైతిక పొత్తు పెట్టుకొని రాష్ట్ర ప్రజలను మోసగించేందుకు సిద్ధమయ్యారని, ఎవరు ఎన్ని కూటములు వచ్చినా విజయం మాదే అని అన్నారు. వినుకొండలో మరోసారి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధిని చూసి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# బాబుని నమ్మితే మిగిలేవి అగచాట్లే

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- మూడో వార్డులో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట:** చంద్రబాబు నాయుడిని నమ్మి మళ్లీ ఓటేస్తే ప్రజలకు అగచాట్లేనని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం మూడోవార్డు నిమ్మతోటలో పర్యటించారు. తొలుత రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నాయబ్ బజారులోని పెద్దమసీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇంటింటికీ తిరుగుతూ గత ఐదేళ్లకాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ గురించి తెలియచేసే కరపత్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్‌కు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వార్డులోని మహిళలతో ప్రత్యేక సమావేశమయ్యారు. గత ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, వైఎస్సార్ కానుక పింఛన్లతో పాటు నవరత్నాల పథకాలను అమలుచేసి పేద ప్రజల కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మానిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను వేటిని సక్రమంగా అమలు చేయలేదన్నారు. డ్వాక్రా మహిళలకు పూర్తి రుణమాఫీ చేస్తానని ప్రకటించి ఎన్నికల తరుణంలో పసుపు–కుంకుమ కింద రూ.10 వేలు ఇచ్చి సరిపెట్టాడన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తానని, ఇళ్లకే తాకట్టు బంగారాన్ని తెచ్చి ఇస్తానని మోసపు మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు అధికారంలోకి రాగానే అనేక పరిమితులు విధించి రుణమాఫీ అరకొరగా చేసి మోసం చేసి విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచాడని వివరించారు. సీఎం జగన్ డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పి రూ.26 వేల కోట్లు అక్కచెల్లెమ్మలకు ఇచ్చాడన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి అన్నిమౌలిక సదుపాయాలు కల్పించి ఆంగ్ల మీడియం ప్రవేశపెట్టి పేద పిల్లలకు కార్పొరేట్ చదువులు చెప్పించారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షలకు పరిమితి పెంచి 3200 రోగాలకు వైద్యసేవలు అందజేశారన్నారు. అమ్మఒడి పేరుతో పేద పిల్లలకు ఉచితంగా చదువు చెప్పించారని, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశారని వివరించారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుంటే పథకాలు సక్రమంగా అమలౌతాయని పేర్కొన్నారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థలు పని చేస్తాయని, ఇంటి ముంగిటకే పరిపాలన వస్తుందని తెలిపారు.



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

కార్యక్రమంలో రెడ్‌క్రాసు సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జగన్‌మోహన్ రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతాపాల్, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, వార్డు నాయకులు సయ్యద్ ఖాజా మొహిద్దీన్, షేక్ శిలార్, మైలేరి మార్కు, మార్కెట్ యార్డు కమిటీ సభ్యురాలు బత్తుల పుష్పలత, మైనార్టీసెల్ జిల్లా కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాషా, షేక్ హిదాయిత్, బొగ్గరం మూర్తి, ఎన్‌కే ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీతయ్య నగర్‌లో నేడు ఎన్నికల ప్రచారం

**వినుకొండ (నూజెండ్ల):** వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని సీతయ్య నగర్‌లో శనివారం మొదలౌతుందని వైఎస్ఆర్‌సిపి పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్ శుక్రవారం తెలియచేశారు. కార్యక్రమంలో భాగంగా సీతయ్య నగర్ (2వ వార్డు), 1వ వార్డుల నందు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొంటారన్నారు.

# వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

**నరసరావుపేట:** ఒకటో వార్డులో ఒకటి రెండు రోజుల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి పూర్తిస్థాయిలో మురుగు కాలువల్లోని పూడిక తీయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి స్థానికులకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో కలసి ఒకటవ వార్డులోని ట్రంకు పెట్టెల బజార్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు కాలువలు ప్రధాన సమస్యగా ఉన్నాయని, కొత్తగా కాలువలు నిర్మించాలని, అదేవిధంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) నీరు మ్యాన్‌హోల్ నుంచి బయటికి వస్తుందని ఆ సమస్య పరిష్కరించాలని కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఈ ప్రదేశం ఎత్తు తక్కువగా ఉండటం వల్ల నీరు మొత్తం ఇటు రావడం జరుగుతోందన్నారు. అదేవిధంగా కాలువలు కూడా పాతవి కావటం వలన సమస్య ఏర్పడిందన్నారు. వెంటనే యూజీడీ మిషన్ తెప్పించి మ్యాన్‌హోల్ నుంచి నీరు బయటకు రాకుండా వాటన్నింటిని శుభ్రం చేయిస్తామన్నారు. నూతన కాలువలు నిర్మాణానికి ప్రతిపాదన రూపొందించాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రామకోటయ్య పాల్గొన్నారు.



ఒకటో వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

# ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

**రొంపిచర్ల:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం తనిఖీ చేసింది. ఈ స్క్వాడ్‌లో వినుకొండ ఎంఈవో సయ్యద్ జఫరుల్లా పాల్గొన్నారు. అలాగే పరీక్షలు జరుగుతున్న రొంపిచర్ల జెడ్పీ పాఠశాలను తహసీల్దార్ ఉషారాణి సందర్శించారు. అక్కడ పరీక్ష వ్రాస్తున్న విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ సౌకర్యాలు, మంచినీటి సౌకర్యాన్ని కూడా ఆమె పరిశీలించారు. అలాగే మండలంలో రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం గ్రామాల్లోని మూడు పరీక్షా కేంద్రాల్లో 580 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేశారు. శుక్రవారం నిర్వహించిన మ్యాథ్స్ పరీక్షకు మొత్తం 580 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 563 మంది హాజరయ్యారు. 17 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



రొంపిచర్ల పరీక్ష కేంద్రంలో స్క్వాడ్

**శావల్యాపురంలో...**

**శావల్యాపురం:** స్థానిక పదోవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్కాడ్ టీం సభ్యులు శుక్రవారం తనిఖీ చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఇనిగంటి సునీల్‌చౌదరి తెలిపారు. ఫ్లయింగ్ స్కాడ్ యం.పినాకపాణి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష కేంద్రంలో గణితం పరీక్షకు సంబంధించి 315 మంది విద్యార్థులకు గాను 290 మంది హాజరైనట్లు చెప్పారు.

# జాతీయస్థాయి కుస్తీ పోటీలకు కేబీఆర్ విద్యార్థి

**నరసరావుపేట ఈస్ట్:** కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాల విద్యార్థి ఆర్.వీరాంజనేయులు జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ (కుస్తీ) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీలలో చిత్తూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో తమ విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారని తెలిపారు. వీరాంజనేయులు 67 కేజీల గ్రీకో–రోమన్ విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి ఢిల్లీలోని నోయిడా స్టేడియంలో జరగనున్న జాతీయస్థాయి కుస్తీ పోటీలలో వీరాంజనేయులు ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కాగా రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు టి.సన్నీ 63కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, ఎం.ధర్మానాయక్ 65 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్టు వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ.వెంకటశివ, పీడి ఎం.వినీల్, అధ్యాపకులు అభినందించారు.



కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాగిరెడ్డి

### ఆధారాలు లేని రూ. 13.50 లక్షలు స్వాధీనం

**చిలకలూరిపేట టౌన్:** ఎన్నికల తనిఖీల్లో భాగంగా రూరల్ పోలీసులు గురువారం రాత్రి జాతీయ రహదారిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మండలం పరిధిలోని బొప్పూడి గ్రామ శివారులో ఉన్న ఓ హోటల్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులో ప్రయాణం చేస్తున్న నరసరావుపేటకు చెందిన అర్వపల్లి శ్రీనివాసరావు, భార్య వరలక్ష్మితో కలసి బెంగుళూరు వెళుతున్నారు. ఈ క్రమంలో అతని వద్ద ఎటువంటి బిల్లులు, ఆధారాలు లేని రూ. 13.50 లక్షలు లభ్యమయ్యాయి. దీనిపై అనుమానం వచ్చిన పోలీసులు నగదును స్వాధీనం చేసుకొని పల్నాడు జిల్లా ఇన్‌కమ్ టాక్స్ అధికారులకు అప్పగించారు. దీనిపై బాధితులు వివరణ కోరగా భార్య వరలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం ఆ నగదును తీసుకు వెళుతున్నట్లు తెలిపారు.

### పీఎంకేఎస్‌కే బ్యానర్లను తొలగించండి

**రొంపిచర్ల:** మండలంలోని ఎరువులు, పురుగు మందుల డీలర్‌లు అందరూ తమ షాపుల్లో ఏర్పాటు చేసిన పీఎంకేఎస్‌కే బ్యానర్స్‌ను వెంటనే తొలగించాలని మండల వ్యవసాయ అధికారి శివలలిత శుక్రవారం తెలిపారు. అలాగే ఎరువుల బ్యాగ్‌లపై ఉన్న మోదీ బొమ్మలపై బ్లాక్ పెయింట్ వేసి అమ్మాలని సూచించారు. ఎన్నికలు నిబంధనలకు లోబడి తూచా తప్పకుండా తమ షాపుల్లో ఈ నిబంధనలు పాటించాలని డీలర్‌లకు ఆమె సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఆ షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు.

### వన్‌టౌన్ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు



**నరసరావుపేట టౌన్:** పట్టణంలోని ప్రధాన అంతర్గత వీధుల్లో వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వి.యస్.ఎన్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలోకి చేరికలు

**వినుకొండ(నూజెండ్ల):** స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నందు పట్టణంలోని 20వ వార్డుకు చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని చూసి అనేక మంది పార్టీలో చేరుతున్నారని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో చేరిన వారందరినీ వైఎస్సార్ సీపీ కుటుంబసభ్యులుగా చూస్తామని, రానున్న రోజుల్లో పార్టీలో సముచితస్థానం కల్పిస్తాని హామీ ఇచ్చారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

# ఉన్నతస్థాయికి చేరడం సంతోషదాయకం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- బరంపేట మసీదులో ప్రార్థనలు

**నరసరావుపేట:** గతంలో ఒకరి కింద పని చేసే ముస్లిం సోదరులు పిల్లలు ప్రస్తుతం వారే పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగటం చాలా సంతోషకరమని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం రెండవ వార్డులోని మసీదులో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక నమాజ్ చేసి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ముస్లిం ల ఆలోచన వేరే విధంగా ఉండేదన్నారు. ప్రస్తుతం వారి ఆలోచన అంతా విద్య, ఉద్యోగం అవకాశాల పైనే ఉందన్నారు. మండల పరిధిలోని చిన్న తురుకుపాలెం గ్రామంలో 29 మంది ముస్లిం వైద్య విద్యార్థులు ఉన్నారంటే అది మన మండలానికే గర్వకారణమని పేర్కొన్నారు. కూలి పనులు చేసుకుని బ్రతికే కుటుంబాల నుంచి వైద్యులు, ఇంజినీర్లు ఆ గ్రామం నుంచి వస్తున్నారన్నారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ ప్రవేశపెట్టిన నాలుగు శాతం రిజర్వేషన్ వల్ల అనేక మంది ముస్లిం సోదరులకు లబ్ధి కలిగిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసి కోట్ల రూపాయలు నిధులు వెచ్చించారన్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ పింఛన్ కానుక, ఇలా అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో మైనార్టీ సోదరులు అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో అనేక మసీదుల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించానని, భవిష్యత్‌లో కూడా అందిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ బాష, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానిక బరంపేట మసీదులో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

### ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి

**వినుకొండ(నూజెండ్ల):** శాలివాహన చక్రవర్తి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శాలివాహన సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు పారెళ్ల రమేష్, వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులు గొట్టం గోవిందరాజులు డిమాండ్ చేశారు. వినుకొండ మండలంలోని కుమ్మరిపాలెం గ్రామంలో శుక్రవారం శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్థలం కేటాయించి శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. శాలివాహన చక్రవర్తి గొప్పతనం గురించి కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షులు బొంకూరి రోశయ్య, కార్యదర్శి మద్దికుంట ఆదినారాయణ, కోశాధికారి పారెళ్ల లక్ష్మయ్య, గ్రామపెద్దలు గురజాల రంగనాయకులు, మన్నేపల్లి చిన్న వెంకటేశ్వర్లు, గురజాల అంకారావు, పుల్లారావు, ఉబ్బారావు, పలుకూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## • దర్గాలో కావటి ప్రత్యేక ప్రార్థనలు

పట్టణంలోని సుభానినగర్‌లో ఉన్న అమీన్‌పీర్ దర్గాలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరిఫుల్లా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోహర్‌నాయుడు కేక్ కట్ చేసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయనకు దర్గాలోని మతగురువులు ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

– చిలకలూరిపేట



### ఎన్నికల నియమావళి పాటించాలి



**ఈపూరు:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వరదా సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బీఎల్‌వోలు, మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎవరైనా ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘిస్తే వారిపై చర్యలకు వెనుకాడమన్నారు. ప్రజలు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే వాటికి కచ్చితంగా సంబంధిత పత్రాలను చూపించాలన్నారు. అలాగే రూ.10 లక్షల లోపు నగదు దొరికితే వాటిని సీజ్ చేసి సబ్ ట్రెజరీకి జమ చేస్తామని, అనంతరం వాటిని సంబంధిత పత్రాలతో విడిపించుకోవాలన్నారు. తహసీల్దార్ దివాకర్, ఎండీవో రంగ నాయకులు, ఎస్ఐ ఫిరోజ్‌ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్ తదితరులు ఉన్నారు.